312) వరాళి

ప|| శ్రీపతి నీవు సిద్ధించుటే సిద్ధులన్నియు | పైపై నీశరణమే పరమపదంబు ||

చ|| పరమాత్మునిపై నాత్మప్రవేశింపజేయుటే | పరికింప బరకాయప్రవేశము |
గరిమ నాహృదయాకాశమున దలచుటే | గిరవై యబ్బినయట్టి ఖేచరత్వము ||

చ|| మంచిపరమహంసనామము ప్రాణులచే వింట | చంచులవినేటిదూరశ్రవణము |
కాంచి నీరూపము ఆరుకమలాల ధ్యానించుట | యెంచగ దూరగమన మింటిలో నౌట ||

చ|| సావధానమె లోచూపు సర్వథా నిన్ను జూచుట | తావులనే అనిమిషత్వము చేరుట |
శ్రీవేంకటేశ్వర నీసేవకుడై నిలుచుటే | వేవేలుతత్వజ్ఞానవిధుల నిలుచుట ||